# పదవులు ముఖ్యం కాదు.. ప్రజా సేవే నా లక్ష్యం



### రామంతపూర్ సర్పంచ్ సౌందర్య రఘుపతి - ఓటమి నేర్పిన పాఠమే నేటి విజయం

### నాయకుడిగా కాదు.. సేవకుడిగా పనిచేస్తా - గ్రామస్తులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

**ఇదే నిజం- మెదక్ జిల్లా ప్రతినిధి**

పదవులు ముఖ్యం కాదని, ప్రజా సేవే తన ప్రథమ లక్ష్యమని మాసాయిపేట మండలం రామంతపూర్ గ్రామ నూతన సర్పంచ్, స్వతంత్ర అభ్యర్థి సౌందర్య రఘుపతి స్పష్టం చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆయన గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సంవత్సరం ప్రజలకు మంచి జరిగే సంవత్సరంగా, మార్పుకు దారి చూపే సంవత్సరంగా నిలవాలని ఆకాంక్షించారు. రామంతపూర్ గ్రామం ఉద్యమాలకు ఊపిరి పోసిన గడ్డ అని, పోరాటాలకు పురిటిగడ్డ అని గుర్తు చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా తాను ప్రజల మధ్యే ఉంటూ, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకున్నానని తెలిపారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని, గ్రామంలో ఎలాంటి తారతమ్యాలు లేకుండా, ఎగువ దిగువ అనే బేధాలు చూపకుండా అందరికీ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. నాయకుడిగా కాకుండా ఒక సేవకుడిగా పనిచేస్తూ గ్రామ అభివృద్ధిలో తనదైన ముద్ర వేస్తానన్నారు. గతంలో ఎదురైన ఓటమి నుంచి నేర్చుకున్న గుణపాఠమే నేడు తనను విజయ తీరాలకు చేర్చిందని రఘుపతి పేర్కొన్నారు. ఆపదలో ఉన్నవారికి ఆపద్బాంధవుడిగా, పిలిస్తే పలికే ప్రజానేతగా నిరంతరం ప్రజల మధ్యే ఉంటానన్నారు. గ్రామాభివృద్ధిలో యువత, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. ప్రజల సహకారం తనకు ఎల్లవేళలా ఉండాలని విజ్ఞప్తి చేశారు. యువ నాయకుడైన రఘుపతి సర్పంచ్‌గా ఎన్నికవడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# కోరం మద్దతుతోనే కాంగ్రెస్ వశమైన అధ్యక్ష పీఠం

## వెల్దుర్తి సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా సంధ్య రామకృష్ణారావు

### అభివృద్ధి పనులే గెలిపించాయి.. సమస్యల పరిష్కారమే నా లక్ష్యం - ఏకగ్రీవంగా ఎన్నుకున్న తోటి సర్పంచులు



**ఇదే నిజం- మెదక్ జిల్లా ప్రతినిధి**

కోరం నిరూపించుకున్న వారికే అధ్యక్ష పదవి దక్కుతుందనే నానుడి నిజమైంది. మెజారిటీ సర్పంచుల మద్దతు కూడగట్టుకోవడంతో వెల్దుర్తి మండల సర్పంచుల ఫోరం అధ్యక్ష పీఠం కాంగ్రెస్ పార్టీకి దక్కింది. వెల్దుర్తి మండల సర్పంచుల ఫోరం నూతన అధ్యక్షుడిగా మంగలపర్తి గ్రామ సర్పంచ్ సంధ్య రామకృష్ణారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధికార పార్టీకి సర్పంచులు మొగ్గు చూపడం సహజమేనని ఈ ఎన్నికతో మరోసారి రుజువైంది.

**సొంత నిధులతో అభివృద్ధి..**

గత ప్రభుత్వ హయాంలో సర్పంచ్‌గా గెలిచిన రామకృష్ణారావు, గ్రామాభివృద్ధి కోసం అనేక పనులు చేశారు. అయితే చేసిన పనులకు సకాలంలో బిల్లులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయినప్పటికీ వెనకడుగు వేయకుండా సొంత నిధులతో గ్రామ ప్రజల అవసరాలు తీరుస్తూ వారి హృదయాలను గెలుచుకున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో, గ్రామాభివృద్ధిని కాంక్షించి ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగలపర్తి గ్రామ ప్రజలతో మమేకమై ఉండటం వల్లే ఆయనను గ్రామస్తులు మళ్లీ ఏకగ్రీవంగా సర్పంచ్‌గా గెలిపించుకున్నారు.

**సర్పంచుల సమస్యలపై పోరాడుతా..**

ఈ సందర్భంగా సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా ఎన్నికైన సంధ్య రామకృష్ణారావు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన తోటి సర్పంచులకు కృతజ్ఞతలు తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ సర్పంచులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా, సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. సర్పంచుల సమస్యల పరిష్కారానికి, వారికి తగిన న్యాయం చేయడానికి తాను ఎల్లప్పుడూ ముందుంటానని హామీ ఇచ్చారు.

# కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధిని జీర్ణించుకోలేని బీఆర్ఎస్ నాయకులు

- మాజీ సర్పంచ్ ఐలయ్య
- సంఘటనపై సమగ్ర విచారణ జరిపించాలి
- పోలీస్ కమిషనర్ కి ఇరువర్గాలు ఫిర్యాదు
- అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించాలి




**గజ్వేల్, జనవరి 2 (ఇదే నిజం) :**

కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధిని జీర్ణించుకోలేక బిఆర్ఎస్ పార్టీ నాయకులు బురద బురద జల్లుతున్నారని సిద్దిపేట జిల్లా లకుడారం గ్రామ మాజీ సర్పంచ్ ఐలయ్య అన్నారు. కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా కాంగ్రెస్ నాయకులు పంచాయతీ సెక్రెటరీ అనుమతితోనే ఫర్నిచర్ ని బయటకు తీసుకువచ్చామని బిఆర్ఎస్ నాయకులు, సర్పంచ్ వారి పాలకవర్గం కాంగ్రెస్ నాయకుల పై అనవసరంగా బురద చల్లుతున్నారని అన్నారు. సర్పంచ్ పాలకవర్గం అభ్యంతరం తెలిపిన వెంటనే ఫర్నిచర్ ని యధావిధిగా గ్రామపంచాయతీ కార్యాలయంలోనే పెట్టామని గ్రామ పంచాయతీ కార్మికులు కూడా అక్కడ ఉన్నారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ సంఘటనతో లకుడారం గ్రామంలో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇరువర్గాలు పోలీస్ కమిషనర్ కి ఫిర్యాదు చేయగా ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరపాలని దోషులుగా ఎవరు తేలితే వారిని కఠినంగా శిక్షించాలని ఇరువర్గాలు పోలీస్ కమిషనర్ ని కోరారు. పోలీసులు లకుడారం గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా బందోబస్తు నిర్వహించారు.

# అడవులను నరికితే జైలుకే

- వన్యప్రాణుల వేట చట్టరీత్యా నేరం
- అటవీ సంపద రక్షణ మనందరి బాధ్యత
- అటవీ శాఖ అధికారులు
- శంషా రెడ్డి పల్లి తండాలో అవగాహన సదస్సు



**మెదక్, జనవరి 02 (ఇదే నిజం ప్రతినిధి):**

అటవీ సంపదను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, అడవులను ధ్వంసం చేస్తే కఠిన చర్యలు తప్పవని అటవీ శాఖ అధికారులు హెచ్చరించారు. శుక్రవారం మెదక్ జిల్లాలోని శంషా రెడ్డి పల్లి తండాలో అటవీ చట్టాలు, వన్యప్రాణుల సంరక్షణపై గ్రామస్తులకు విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. అడవికి నిప్పు పెట్టడం నేరమని స్పష్టం చేశారు. అటవీ ప్రాంతాల్లో ఉద్దేశపూర్వకంగా మంటలు పెట్టడం వల్ల అరుదైన వన్యప్రాణులకు, పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని వివరించారు. మూగజీవాలను వేటాడటం చట్టరీత్యా నేరమని, ఎవరైనా వేట వంటి పనులకు పాల్పడితే వారికి జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. అటవీ భూములను ఆక్రమించడం శిక్షార్హమని, ఆక్రమణలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు. అటవీ రక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అధికారులు కోరగా, గ్రామస్తుల నుంచి సానుకూల స్పందన లభించింది. అటవీ సంపదను కాపాడుకోవడంలో తాము ఎప్పుడూ ముందుంటామని గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గణేష్, ఫారెస్ట్ సెక్షన్ అధికారి శ్రీనివాస్, బీట్ అధికారి, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.



# రామకోటి రామరాజు కృషి, పట్టుదల అమోఘం

### పోలీసులకు 'శ్రీరామరక్ష' పుస్తకాల పంపిణీ

### గజ్వేల్ సీఐ రవికుమార్ అభినందన



**గజ్వేల్, జనవరి 2 (ఇదే నిజం):**

రామనామమే ప్రాణంగా భావిస్తూ శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపకులు రామకోటి రామరాజు చేస్తున్న ఆధ్యాత్మిక సేవలు, ఆయన పట్టుదల అమోఘమని గజ్వేల్ సీఐ రవికుమార్ కొనియాడారు. శుక్రవారం 'భక్తిరత్న' జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు.. సీఐ రవికుమార్‌ను కలిసి లోక కల్యాణార్థం పారాయణం చేసే భద్రాచల దేవస్థాన 'శ్రీరామరక్ష స్తోత్ర' పుస్తకాలను అందజేశారు. అనంతరం సీఐ రవికుమార్ చేతుల మీదుగా పోలీస్ డిపార్ట్‌మెంట్ సిబ్బందికి ఈ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. పవిత్రమైన శ్రీరామరక్ష స్తోత్ర పుస్తకాన్ని అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా రామరాజు ఆధ్యాత్మిక రంగంలో చేస్తున్న నిస్వార్థ సేవలను ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు.

# అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా అక్షరాభ్యాసం

### చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం

### పిల్లలకు పోషకాహారం అందించాలి: ఐసీడీఎస్ సూపర్వైజర్ అంజమ్మ

### నూతన ఏసీఎంఎస్ కమిటీ ఎంపిక



**చిన్నశంకరంపేట, జనవరి 2 (ఇదే నిజం):**

మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం బాగిర్తిపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం సందడి నెలకొంది. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిన్నారులకు అక్షరాభ్యాసం మరియు అన్నప్రాసన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐసీడీఎస్ సూపర్వైజర్ అంజమ్మ మాట్లాడుతూ.. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు పోషకాహారం చాలా ముఖ్యమని అన్నారు. తల్లులు తమ పిల్లలకు ఆకుకూరలు, కూరగాయలతో కూడిన పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని సూచించారు. అనంతరం గ్రామ సర్పంచ్ సావిత్రి ఆధ్వర్యంలో అంగన్వాడీ సెంటర్ మేనేజ్‌మెంట్ సొసైటీ నూతన కమిటీని నియమించారు. అంగన్వాడీ కేంద్రం అభివృద్ధికి, పిల్లలకు మెరుగైన సేవలందించేందుకు ఈ కమిటీ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సావిత్రి, ఉపసర్పంచ్ మహేష్, అంగన్వాడీ కార్యకర్త వరలక్ష్మి, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు, చిన్నారుల తల్లులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

